దాగుడు మూతలు

*
* *

'హాలో...మోహన్!...'

తలవని తలంపుగా...మిత్రుని అమితబలవంతంమూలాన... పనితొందరలన్నీ తెముల్చుకుని మదరాసు బయలుదేరడం...కృత్యాద్యవస్థ అయింది. "పరంజ్యోతి" దసరా సంచికను సర్వాంగ సుందరంగా.. శాయశక్తులూ వినియోగించి తయారుచేసిన...మానసిక-బడలికలోనే, ఆదరబాదర...రవంత అయినా వ్యవధానం లేకుండా ప్రయాణం కావడం...కొంచెం విసుగుగానే ఉన్నది, శాస్త్రికి. కాని, జీవికాజీవి...మోహన్ తప్పదని పట్టుపట్టడంచేత ... ఆతని ఉత్సాహానికి విఘాతం కలిగించినట్లవుతుందేమో, ఆతడు వెళ్ళుతూన్నది... ప్రియా సందర్శమునకు కదా అని ... ఒప్పుకోక తప్పింది కాదు.

ఎనిమిదిగంటలు మోగుతూండగా ... మెయిల్ సెంట్రలుకు వచ్చి ఆగింది. శాస్త్రి, చల్లగాలి హాయికి...నడనడంగా కూర్కుతూ మెలకువగా ఉండకపోవడంచేత...మోహన్ దిగిపోయినతరువాత కాని, కనులు తెరవలేదు...

అప్పటికప్పుడే ఆతడు...ఎదుర్కొనడానికి వచ్చిన...మిత్రులతో...సంభాషణం చేస్తూఉన్నాడు. శాస్త్రిసమీపించడం చూసి నిలుచున్నవారందరూ కొంచెంఎడమై...స్వాగత-పరిచయ సూచనలు కనబరిచారు. మోహన్ తన సరసను శాస్త్రిని నిలుపుకొని ... ఎరుకపరచాడు—

46 ‘వీరు... డాక్టరు శర్మగారు.—నా ఆప్త మిత్రుడు... శాస్త్రి,

పరస్పరాభివందన లాంఛనములైన తరువాత, శర్మగారు... తన భార్యను... కుమార్తె నిర్మలనూ నిర్దేశించి, పరిచయము చేసినాడు.

... స్త్రీలు ఇద్దరూ, నవనాగరిక నేపథ్యంలో ఉన్నారు. శాస్త్రి, శ్రోత్రియ తత్త్వమునకు... ఈవిలాసములూ, నదరూ-బెదురూలేని-తనం, నిర్భయంగా, పురుషులతో సమానప్రతిపత్తి కలిపించుకుని మెలగే చనవూ, పూసుకుని రావడం... ఎబ్బెట్టుగా కనిపించినవి. లోకవృత్తమును ఎరిగినవాడైనా... సర్వసమర్థుడైన పత్రికాకారుడైనా... పండితుడైనా... పూర్వాచారాభిమానితుడు కావడం చేత ,...మామూలు బ్రాహ్మణ సంసారులలో... కుటుంబ స్త్రీలలో... ఈవేష భాషలు గోచరించడం వింతగా కనిపించి కలవర పరచినవి. కాని... అదీగాక, ఇంకో చిక్కు వచ్చింది. వాళ్లకు పునరభివాదను ఏవిధంగా చేయడం— కరస్పర్శనమా... లేక చేతులు జోడించడమా...? ఈవిభ్రమం... తల్లి, కూతురు గమనించినట్టున్నారు— తమకు తామే చిరునవ్వుతో... చేతులు అందించి... ఆతని స్పర్శ... అలవాటు లేని ఆపోశనమని గ్రహించి, కళ్లలో కొంటెతనం మెరయించారు.

‘వీరే . కాదూ, “పరంజ్యోతి” ఎడిటరు...?’ ... అని ప్రశ్నించింది శర్మగారి భార్య.

‘అవును. శాస్త్రి.. నీ మేగజైన్ అంటే వీరికి చాలా యిష్టం...’ అని మోహను వివరించాడు.

‘యస్... యస్. నిర్మలకు... ఆ పత్రిక కనబడితే... నిద్రాహారాలు కూడా మరచిపోతుంది... సొంతం అయ్యే దాకా...’ అని శర్మగారు.

‘ ఏమండీ... దసరాసంచిక తయారయిందా ?’ అంటూ నిర్మల ఉత్సాహంగా అడిగింది:

‘ఆఁ... పంపించాము కూడానే, మీకు ఇవాళ అందుతుంది...’

‘కాదు, రేపు: నెల్లూరువెళ్ళి... ఇక్కడకు తిరిగి వస్తుంది. మీ వెంట కాపీలు ఏమీ తీసుకురాలేదూ... ?’

‘ఉండవచ్చును. సాయంకాలము తప్పక తీసుకువస్తాను’

‘అదేమిటి... మీరు, మా అతిథులు. ఎక్కడకూ, వేరే మరోచోటికి వెళ్లడానికి వీలులేదు...’ అని శర్మగారు బలవంతం చేశారు. ఆయనభార్య... నిర్మలాకూడా మొగమాట పరచారు. కాని, శాస్త్రి... తప్పించుకుని... సాయంకాలము టీకి వస్తానని ఒప్పుకుని... యూనివర్సిటీ క్లబ్బులో ఉన్న ఓ మిత్రుడిదగ్గర విడియడమునకు వెళ్లిపోయినాడు. మోహన్, శర్మగారితో కలసి... ఉండిపోయినాడు.

—మూడున్నర కావచ్చింది. నిమిషాలు గడచినకొద్దీశాస్త్రికి వాళ్లయింటికి వెళ్లడమూ, మానడమూ అనే విచికిత్స జాస్తి అయిం ది. తల్లీ కూతురిని చూసినప్పటినుంచి... అకారణమాత్సర్యం ఆవహించింది. వారివాలకం...చిరాకు తెప్పిస్తూన్నది— తలచుకున్నప్పుడల్లా. పోనీ, పద్ధెనిమిదిఏళ్ల...వయసుగత్తె...అనర్సుకాదూ చదువుతూన్నదని, శర్మగారు అన్నది...ఆమె ఎన్ని వేషములువేసినా ఫరవాలేదు. కానిఆతల్లి, శర్మగారిభార్య...ఏ ముప్ఫైఅయిదుఅయినా వయసు ఉంటుందికదా...పసిదానిలాగా...ఇంకా అంతకన్నా ఎక్కువగా... ఆ సింగారమేమిటి ?...ఆలాటివాళ్ళయింటికి... వెళ్లకూడదు. పత్రిక ఎవరిచేతనన్నా, పంపించవచ్చును. మోహన్ వస్తాడేమో, ఆతనితో ఏదో సాకుచెప్పి...ఏలాగో తప్పించుకుంటే...

కాని... ఉదయం... శర్మగారిభార్య, నిర్మల పిలిచినప్పుడు... మౌనందాల్చి, అహ్వానానికి అర్ధాంగీకార సూచన కలిగించి... వెళ్లడము మానివేయడం, మర్యాదాహీనము కాదూ ?... ఏమని భావిస్తారో... ? తనకేమికాని... మోహానుని గౌరవం కాపాడటం కోసం... మాట దక్కించడానికైనా... వెళ్ళకతప్పదు... ఈ ఒక్క మారు. మళ్ళా, రమ్మని పిలిస్తే... నిష్కర్షగా చెప్పి వేయవచ్చును. ఆలాగని మనసు దిటవు పరచుకున్నాడు.

జాగ్రత్తగా వేషధారణంచేసి, సరిగా వేళకు... ఇలియట్సు రోడ్డులో, వారి భవనం కనుక్కొని వెళ్ళాడు. అందరూ, చాలా గౌరవించి, ఆహ్వానించారు... ఆప్యాయనంగా :

... ఇంతకు ముందుసారి చూసిన దాని కన్నా ఎక్కువ అందంగా కనిపించింది, నిర్మల. ముఖమల్ వారు జోడు వేసుకున్నది. లేత గోధుమరంగు ముద్దకుంకుమపూవులంచు ఆగ్రాచీరె... గుజరాతీ, పైఠిసీ కత్తిరింపు అర్ధకంచుకం. ముత్యాల ప్రాలంబికం. తలలో, ఒరిగి పదూలుగా జారిపోతూ దొంతరమల్లెల కత్తెరదండ. కలువకన్నులలోనూ, పాలబుగ్గలలోనూ, తారుణ్యం మిసమిసలు తేలుతూన్నది: ఆ మనోహరాకృతి చూసేసరికి అదివరకు ఉన్న సంకోచం... కలిగిన ఆగ్రహం... అంతా మాయం చేసుకున్నాడు శాస్త్రి.

ప్రథమ సల్లాపముల వంతులు తీర్చుకున్న తరువాత... టీ పుచ్చుకునేందుకు... ఆసీనులైనారు. శాస్త్రి నిగ్మల ప్రక్కను... మోహాన్ కూడా బలవంతము చేయడంచేత... కూర్చోక తప్పింది కాదు. ఆ అమ్మాయి... తగని సరదాతో... "పరంజ్యోతి" ని తిరగవేస్తూ, పేజీ పేజీకి, చదివి... చూసి... మురిసి పోతూ, ప్రశ్నల వర్షం కురిపిస్తూ—

శాస్త్రికి... పదార్థములు ఏవీ నోటపెట్టుకునేందుకు మనస్కరించలేదు. అందిచ్చే పరిచారకుడా ఏ వర్ణమువాడో పోల్చు

కునేందుకు వీలులేదు. ఇక అమరించినవా...ఏమి కలిసినవో... వింతరుచులవో, పాశ్చాత్య విధానపాక క్రమమును వ్యక్తము చేస్తూ న్నవి. అందువల్ల...టీతో సరిపెట్టుకుని, ఆభాస చేయకుండా ఏలాగో మొక్కు తీర్చుకుని, లేచాడు...

బీచికి షికారువెళ్లి తిరిగివచ్చాడు...వారందరితో. భోజనానికి ఉండిపోవలసినదని ... నిర్మల మారాము చేసినా... వీలులేదని చెప్పేసి ... తప్పించుకునే ... ప్రయత్నంలో ఉండగా ... మరునాడు, మళ్లా ఆవేళకు, టీకిరాక తప్పదని శర్మగారిభార్య, నిలవేసి... ఒప్పించింది.

'రాను...ముమ్మాటికీ రాను...' అనే మాటలు నాలుక చివరదాకా వచ్చినవి. కాని, వెంటనే తమాయించుకున్నాడు. ఆడ వాళ్లతో అంత కఠినంగా మాట్లాడవచ్చునా? వారివాక్కే ఎంతో కోమలంగా ఉంటుంది: అందులో ఆహ్వానించేది...ఇటువంటివారైనప్పుడు...అన్యథా ఉత్తరం యిస్తే...వట్టిమోటుతనంగా ఉండదూ? సరే...రేపటిమాట అప్పుడు...అందాకా వచ్చినతరువాత చూసుకో వచ్చును...అని, ఏమీ తొణకకుండా అప్పటికి వారినివీడ్కొన్నాడు:

మరునాడు...ఉదయం పదిగంటలకు శర్మగారి కార్‌లో, మోహన్, క్లబ్బుకువచ్చాడు. కాబోయే పెండ్లికొడుకు, ...నిర్మల లాటి చక్కనిచుక్కను, సరసురాలిని సహధర్మచారిణిగా చేసుకో బోయే భాగ్యశాలి...అందగాడు, అందమును రెట్టించే అలంకరణ మర్యాదలెరిగిన నాగరకుడు...వృద్ధిలోకివస్తూన్న లాయరు...తీయని కోరికలు నిలువెల్లా కమ్ముకునిపోయినట్లున్న ఆతన్ని చూడగానే... శాస్త్రికి...వాత్సల్యం ఇనుమడించింది. మనసులో అర్థముకాని... నిరూపించలేని...ఆలోచనలు...కొనలుసాగినవి...

ఉన్నగంటసేపూ ... మోహన్ ... నిర్మలనుగూర్చి వంది మాగధ ప్రశంసలు పరవళ్లుకొట్టించి ... ఆమె ఆంధ్రభాషాపాండి

త్యాన్నీ... రసజ్ఞతనూ... కవితాధోరణినీ... ఒకటే మెచ్చుకుని... శాస్త్రితో, సాయంకాలము టీకి రావలసిన బాధ్యత ఉన్నదని మరో మారు జ్ఞాపకం చేసి... నిష్క్రమించాడు...

ఆతని వెంటనే... ఆతడు తీసిన దోవలనే... శాస్త్రి మనసు, నిర్మల చాయలకు పోయింది. సనాతనిష్ఠామేఘమాలికలు... శరచ్చంద్రికాపరిసారంలో ... విరిసి తప్పుకుని పోయినవి. నిర్మల... ఎంత అందగత్తె... ఎంత తెలివితేటలున్నది... ఎంత నేర్పరి...! మోహన్... తగినవాడే అయినా... ఆమెకు అనురూపుడా...? గృహలక్ష్మిగా... వరించేభాగ్యం... ఆ, సామాన్య లౌకికునికి...?... ఊహుఁ...! మిత్రుని విషయంలో అపచారం చేయడంకాదూ, ఇలా భావించడం...? తాను వచ్చినది, మోహన్‌కు ఆసలాగా ఉండి ఆ నూతన పరిణయమునకు, చేతనైన ఔపచారిక దోహద విధానముల మెలకువలు తీర్చడానికా... లేక, వంచనచేయడానికా ?... ఇది తగనపని. కాని... నిర్మల...

ఆరాటం తీరలేదు. కాని, కాలం, ఎంతవారికైనాసరే మన్నించి... ఆగిపోతుందా...? నాలుగుగంటలు కావస్తూండగానే... శాస్త్రి... పునః ఇలియట్సురోడ్డు ప్రాంతమున అవతరించాడు...

... ఎదురుగా ఎవరూ రాలేదు. హాలులో కూడా ఎవరూ కనబడలేదు. అర్థంకాక... అందరూ ఎక్కడకు వెళ్లినారో ఏమో అనుకుంటూ... పక్కనున్న ద్వారం తెర ఒత్తిగించాడు.

... యీజీఛైర్‌లో నిర్మల విలాసంగా వాలి, "పరంజ్యోతి" తదేక ధ్యానంతో చూస్తూన్నది. గదిలో గోడల అంచుగా... పెన్స్నడుసీడర్ స్కెచింగ్ బుక్ కేసులు పుస్తకాలతో క్రిక్కిరిసిపోయి... అమరి ఉన్నవి. పెద్ద కిటికీ ఇరుపక్కలా, చలువరాతి పెడస్టల్సుమీద... శిల్పచిత్రములున్నవి. క్రింద... అడుగుదిగి

పోయేటంత పట్టు మెత్తదనంతో పారశీ తివాచీ పరచిఉన్నది. మధ్యగా... రోజినావ్ మాడేల్ యేజోరా... సోఫాలూ... ముత్తెపుచిప్ప పరచిన మహాగని సెంటర్ పీస్. కుడివైపున,... ఓక్ రాయల్... వర్కు టేబుల్. తెరలకు ఫ్లెమిష్‌వయోలా క్రీప్ అండ్ గోల్డు అద్దకములూ. అప్ హోల్‌స్టరీ... అలంకారములూ... పరాసువారి యిళ్ళను మించిపోయి ఉన్నవి.

నిర్మల పడక కుర్చీలోంచి లేచి, పుస్తకం విడిచి... సోఫా వద్దకువచ్చి... మూలకు ఓరగిలి కూర్చుని శాస్త్రినికూడా సరసను ఆసీనుణ్ణి చేసింది...

'అంతా... 'వైట్‌వే' కు... వెళ్లారు. వచ్చే వేళ అయింది...'—అన్నది, సంభాషణకు ఉపక్రమించి.

'అట్టనా. మిమ్మల్ని డిస్టర్బ్ చేయడం...'

'...' కోర్స్‌నాట్. మీరుయింకా రాలేదేమో అనుకుంటూ న్నాను. తనివి తీరక 'పరంజ్యోతి' మళ్ళీ చదువుతున్నాను : ఎంత చక్కని గెటప్ యిస్తారండీ... చాలాఖర్చుఅవుతూండాలి...?'

'అవును. ఏమైనా ... ఆదర్శప్రాయంగా, ఉత్తమరీతిని తయారు చేయవలెనని...పట్టుదల, నాకు. ఖర్చుకు లక్ష్యము చేయ డం లేదు :'

'ఆహాఁ. ప్రస్తుతం ... నేనెరుగున్నంతవరకూ, యిటువంటిది మరొకటిలేదు. అంతా ఇంగ్లీషుపద్ధతిని ...ఎంతసీట్‌గాఉన్నదండీ... లే ఔట్ ! అదీగాక...కథలూ పద్యాలూ... మాత్రమే ప్రచురించడం, నిజంగా...అద్భుతంగా ఉన్నది. లేకపోతే... శాసనాలూ...వితం డాలు...ఎవరికి కావలి'

'అవును...ఈకాలమునకు ...ఇలాటిపత్రిక అవసరమనే... తలపెట్టాను. ఏడాదిగడచింది...దైవకృపను'

'తప్పకుండా...నిలిచితీరుతుండి. సక్సీడ్ అవాలి...నోడౌట్'

'...మీబోటివారి సహాయం కూడా...కాస్త...'

'ఏవిధంగా...'

'ఏమన్నా కథలు...పద్యాలు...'

'నేనేమీ వ్రాయనే...'

'వ్రాయరూ...? ఉదయమేకదూ మోహన్ చెప్పాడు...మీ విషయమంతా...'

'ఏమని...? ఆయనమాటలకు ఏం లెండి'

'అలాకాదు. మీరు దయఉంచి...వచ్చేసంచికకు...'

'అంతపెద్దమాట ఎందుకూ! నో...శాస్త్రిజీ! అప్పుడప్పుడు ఏవేవో పిచ్చిపిచ్చిపద్యాలూ పాటలూ... కథలూ వ్రాస్తూంటాననుకోండి. కాని, ఏవీ ప్రకటనార్హములు కావు...'

'నేను...చూడవచ్చునా?'

'...రేపు టీకివచ్చినప్పుడు...చూద్దురుకాని. ఏంప్రయోజనం? ఒక్కటైనా మీకుపనికివస్తుందని తోచదు...'

'చూస్తానుకాదూ... విలువనుగుర్తించే భాగ్యావకాశం... నాకు వదిలివేయాలి...'

'అయితే...ఏమండీ ... మన "పరంజ్యోతి" లో... వసంత కుమార...అని, పద్యాలూ, కథలూ వ్రాస్తూంటాడే ... హూ యిజ్ హి ?'

'ఎందుకూ... మీకు?'

'ఆయన రచనలంటే... నాకు తగనిప్రీతి. అంతచక్కగా ఇంకొకరు వ్రాయలేరన్నంత అభిమానం...నాపద్యాలన్నిటికీ భావావలంబనం... ఇన్స్పిరేషన్ ... ఆయన...రచనలే...!'

... ఆ ప్రశ్న నిర్మల వేస్తుందని, శాస్త్రి కలగన్నాడా... వినగానే చలించక ఎలా ఉంటాడు...? ధీరుడు కనుక మనోగత భావా

లను గోపనం చేసుకోగలిగినా... ఆమీాది...నిర్మల వివరణం... వ్యాఖ్య... మరీ తలకిందులు చేసింది. నిరుత్తరుడైనాడు. ఏమని సమాధానం ఇవ్వాలి ?

'ఏం... అంత ఆలోచన చేస్తున్నారు ?'

'...ఎవరో జ్ఞాపకం... తెచ్చుకుందామని. రేపు చెపుతాను లెండి...'

'తప్పకుండా. ఇవాళలాగా మరపు అభినయించకూడదు...'

చూపుల ఎకసెక్కమునకు... లొంగిపోయి... దొంగ అప్పుడే దొరికిపోయేవాడే కాని...

...కారువచ్చి ఆగింది. వెళ్లినవారు తిరిగి వచ్చారు. శాస్త్రి... మోహనుచాటున నిర్మలకళ్లకు అందకుండా... టీ తాగి,... వెళ్లిపోయేటంతవరకూ... దాగిపోయినాడు.

— క్లబ్బుకు చేరుకుని... అక్కడి మిత్రులతో కలసి సినీమాలకు తిరిగి... అర్ధరాత్రి మళ్ళీనతరువాత... నడుమువాల్చాడు. కాని... శాస్త్రికంటికి నిదురదూరమైంది. అలలు అలలుగా, ఆలోచనలు ...!

ఏమిటి... నిర్మలవిషయం ...? ఆమె మోహన్‌ను గాఢంగా ప్రేమించుతూన్నదా... లేదా ... ? చేతలలో... వర్తనలో అంత తీవ్ర అనురాగము గోచరించక పోయినా... నిజానికి... మరి, సర్వ సిద్ధమైన తరువాత...

వసంతకుమార్ విషయం అడగటం ఎందుకూ ...? ఆతని రచనలే... నిర్మల కావ్యజీవనమునకు ఆదర్శములా...? ఎవరైతే నేం... ఆమెకు ఎందుకూ...? రచనలమీాద గౌరవం... క్రమంగా, రచయితమీాదకు... ప్రేమకిరణాలను ప్రసరిస్తూన్నదా...? వెర్రి కోరికలు...! అయినా, ఏమో...

వసంతకుమార్ ...ఎవరో యదార్థంగా చెప్పవలసిందేనా...? చెపితే... మరి, మోహన్...

ప్రథమంలో నిర్మలను చూసినప్పుడు... కలిగిన నిరసన... నిస్పందస్థితి,... ఇప్పుడు... ఈభావాలు... ఎంత మార్పు!

దైవముకూడా... అనుకూలుడుగాఉన్నాడు. విధి నిర్దేశమును తప్పించుకోవాలని ఎంత పెనుగులాడినా... ఆపంథా మంచిదా ?...

—ఆ సాయంకాలము శాస్త్రి వెళ్ళిన వేళకు... నిర్మల ఒంటరిగానే ఉన్నది. మొగవాళ్లు ఇద్దరూ టౌనులోకి వెళ్ళారు. శర్మగారి భార్య... స్నేహితు రాండ్రతో మాట్లాడుతూ...లోపల ఎక్కడనో ఉన్నది.

నిర్మల...లైబ్రిరీలో...కిటికీదగ్గరగా, నీరెండ మీదపడేటట్టు కూర్చుని... చదువుకుంటూన్నది. సద్దు చేయకుండా వెళ్లి...శాస్త్రి, అలుమారలలోని గ్రంథనామములను పరామర్శించడం మొదలు పెట్టాడు. విఖ్యాత ఐరోపీయ కావ్యగురువుల ఉత్తమరచనలు— ఆంగ్ల అనువాదములలో, దేశీయ సాహిత్యగ్రంథములు... మూలములో,— చూస్తేనే కడుపునిండేటట్టు... చక్కని బైండింగులలో తీరికలుగా ఉన్నవి...

అంతలో...చూచిందికాబోలును, నిర్మల...హల్లో అంటూ, చదువుతూన్న పుస్తకంమూసి ... కుర్చీలోంచిలేచి ఎదురుగుండా వచ్చింది. శాస్త్రి ఆమెను సమీపించుతూ...

'ఏమిటి...ఆగ్రంథం...' అని పలుకరించాడు.

'"రెడ్‌లిల్లీ", ఎక్సలెంట్ నావెల్ కదూ!'

'ష్యూర్. ఎంతవరకూ వచ్చారు'

'...కవయిత్రి వివియాన్ బెల్...స్నేహితులనందరినీ...టీకి పిలుస్తూన్నది...'

'ఓ...ముఖ్యపట్టులోకి వస్తున్నారు...'

'...కూర్చోండి. ఫాదర్...వాళ్లూ ఇప్పుడే వస్తారు. ఆఁ... బై-ది-బై జ్ఞాపకం చేసుకున్నారా?'

'చెప్పుతానులెండి. ఏవీ... మీ రచనలు— చూపిస్తా నన్నారు కాదూ...'

'... ఆమాట... ఇంకా మరచిపోలేదూ...'

'ఇంపాస్. తీసుకురారూ ?'

— నిర్మల... డ్రాయరు లాగి... ఫోల్డరు అందుకుని... రిబ్బన్ సడలించి... కాగితముల దొంతరను... ఎదురుగా ఉంచింది.

లేతగులాబీ... బెల్జియన్ బాండ్ పేపరు... బొగెయిన్ వీలా... పసివాసన... శాస్త్రికి... తమకం హెచ్చించి పారవశ్యం కలిగించింది. పరిశీలించడం మొదలు పెట్టినాడు. అవి చాల వరకూ కథలు. పద్యాలు... చాలాకొద్దిగా...

"కలువ కన్నులు"... అనే కథ కనిపించింది. 'చక్కని చుక్కనని... ఆ నవమోహినికి తగని గర్వం...! ఒకమారు చూసి తే... చాలు... చలించని వారు... చూపుమళ్లించుకుని... దిటవుగా ఉండగలిగిన తాహత్...'— అని మొదలు...

'అయితే... ఎవరు, ఆ వసంతకుమార్ ?'

'ఆ... ఆయనా...? చెపుతాను—ఎంత బాగున్నదండీ... కథ...'

'సరే... ముందు చెప్పండి...'

'చదవనీయండి. పేరుకూడా అందంగా ఉంది... "కలువ కన్నులు..."'

'చెప్పితీరాలి... తరువాత చదువుదురుకాని...'

'తెలుసుకుంటే... మీకు ఏం ప్రయోజనం ?'

'అదంతా మీకు ఎందుకూ...? మాట తప్పించకండి, చెప్పరూ...'

'మీరు... ఎరుగున్నారు...'

'అబద్ధం... ! పోనీ లెండి... '

'మీరు... చూశారు... '

'చూశానా... ఎప్పుడు... ? '

'మాట్లాడారు... '

— నిర్మల... శాస్త్రి వేపు వింతగా చూసి...తప్పుజవాబు చెప్పేకుర్రివాడిలాగు... అయిష్టంగా...

' మోహన్ '

శాస్త్రి...ఆపేరు ఆమెఉచ్చరించడమే...సహించలేకపోయినాడు. మోహన్ !... వసంతకుమార్!...దాచుకోలేని పరిహాసరేఖ...కనులలో నర్తించినది.

' అవునా...కాదా ? '

...ఈ ప్రశ్న అనవసరమని...కలిసి పెనవేసుకుని పోతూన్న వాళ్లచూపులే...సాక్ష్యమిచ్చినవి. నిర్మల...అర్థంచేసుకునేనా... అర్థంకానట్టు నటించి...కొంటె !

' వసంతకుమార్... ! '

నిర్మల కుడిచెవి...లోలక్...శాస్త్రి చెక్కిలిని పుణికింది... ఉత్తరక్షణమున...

మరి...మోహన్... ?

నిర్మల కలువకనుల్లో... కేరింతలుచూసి...శాస్త్రి, మోహన్ మాటను...తననే తాను...మరచిపోయినాడు...

...అప్పుడే అచ్చయివచ్చిన...'హారైజన్స' ...అనే నూతన ఆంగ్లకావ్య సంపుటిని చదువుతూ—హాలులో ఆ అమాయకుడు మోహన్...కూర్చునిఉన్న సంగతి—ఎవరికి కావాలి ?

* *
*